# సాక్షి
# పార్వతీపురం మన్యం

సోమవారం । 6 । జనవరి । 2025






**పుంజుకుంటున్న కోళ్లు..**

సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కోడిపందాల సందడి నెలకొంటుంది.

- 8లో



**ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే సహించం**

ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే పీఎం మోదీ, సీఎం చంద్రబాబులకు పతనం తప్పదని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు.

- 8లో



**వాలీబాల్ పోటీలకు జేఎన్‌టీయూ**

జైపూర్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలలో పాల్గొనే జేఎన్‌టీయూ జట్టును ఆదివారం ప్రకటించారు.

- 8లో

## న్యూస్‌రీల్

### 7న పాలకొండలో మినీ జాబ్‌మేళా

**పార్వతీపురం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధికల్పన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పాలకొండలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ చదువుకుని, 18నుంచి 32 ఏళ్ల వయస్సున్న నిరుద్యోగ యువత ఈ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో బయోడేటా, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో పాటు పాస్‌పోర్ట్ సైజ్‌ను తీసుకుని జాబ్‌మేళాకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 63012 75511 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### కళ్లికోటకు చేరుకున్న ఏనుగుల గుంపు



కళ్లికోట-కారవవలస మధ్యలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

**కొమరాడ:** గడిచిన నెలరోజులుగా గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు ఆదివారం కొమరాడ మండలంలోని కళ్లికోట, గారవలస గ్రామ సమీపంలోకి చేరుకుంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో కూరగాయల సాగు ఎక్కువగా ఉండడంతో చేతికివచ్చిన టమాటో, అరటి తదితర కూరగాయల పంటలతోపాటు జొన్న, కళ్లాల్లో ఉన్న ధాన్యం ధ్వంసం చేస్తాయోమోనన్న భయంతో ఉన్నారు. ఏనుగుల గుంపును తరలించడంపై అటవీశాఖాధికారులు స్పందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి కొండ ప్రాంతాల వైపు ఏనుగుల గుంపును తరలించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

### జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

- మంత్రి సంధ్యారాణి



మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

**సాలూరు:** జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకుని తద్వారా యువత ఉపాధి మార్గాలను సుగమం చేసుకోవాలని స్త్రీశిశుసంక్షేమ,గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన మెగాజాబ్‌మేళాలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, యువతకు ఉపాధి కల్పన ధ్యేయంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు.ఈ జాబ్‌మేళాలో సుమారు 25 ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ సాయికృష్ణచైతన్య, కళాశాల ప్రిన్సిపాల్ ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా రేపు

**విజయనగరం అర్బన్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, గవర్నమెంట్ ఐటీఐ కళాశాల విజయనగరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పనలో భాగంగా ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ డిప్లమో, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన 35 సంవత్సరాల వయసులోపు ఉన్న నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాలో సేఫ్ డ్రైవ్ ప్లస్, హెటిరోడ్రగ్స్ తదితర బహుళ జాతి కంపెనీలు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటాయని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీయువకులు తమ వివరాలను 'నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకుని అడ్మిట్ కార్డుతోపాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, ఒక పాస్‌పోర్టు సైజ్ ఫోటోతో ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రాంగణానికి హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫోన్: 79956 91295, టోల్ ఫ్రీ: 9988853335 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ఉంటుందో.. ఊడుతుందో





## పింఛనర్ల టెన్షన్

- పింఛన్ లబ్ధిదారులపై పగబట్టిన కూటమి ప్రభుత్వం
- నేటి నుంచి పలు రకాల పింఛన్‌ల తనిఖీ
- అర్హత పరీక్ష పేరుతో తొలగించే యత్నం
- నాలుగు దశల్లో తొలగింపు చర్యలు
- జిల్లాలో ఇప్పటి వరకు అందిస్తున్న పింఛన్లు 1.41 లక్షలు
- అర్హత తనిఖీలకు 4 వైద్యబృందాలు
- తొలి దశలో రూ.15వేలు ఇచ్చే పింఛన్ల అర్హత పరీక్షలు
- రెండవ దశలో విభిన్న ప్రతిభావంతులకు పరీక్షలు
- దశలవారీగా తొలగించేందుకు చర్యలు



ఎన్నికల ముందు అలవికాని హామీలిచ్చి అధికారం చేపట్టిన తరువాత హామీలను నీరుగార్చే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అంటూ ఊదరగొట్టిన కూటమి నాయకులు పథకాలను అమలు చేయకుండా యూటర్న్ పాలిటిక్స్ చేస్తున్నారు. సూపర్ సిక్స్‌లో ఒక హామీ అయిన పింఛన్ పథకాన్ని అమలు చేసి..ఇప్పుడు లబ్ధిదారులు తింటున్న కంచం లాగేసే చర్యలకు పాల్పడుతోంది. పింఛన్ లబ్ధిదారులపై కూటమి ప్రభుత్వం పగబట్టినట్లుగా వ్యవహరిస్తూ అర్హత పరీక్ష పేరుతో లబ్ధిదారుల తొలగింపునకు శ్రీకారం చుడుతోంది. అర్హత పరీక్షలో నెగ్గితేనే ఇకపై పింఛన్ అందుతుంది. లేదంటే కడుపు మాడ్చుకోవాల్సిన పరిస్థితే ఏర్పడుతుంది.

-పార్వతీపురం టౌన్


జిల్లాలో ప్రతినెలా వివిధ రకాలకు చెందిన 1,41,629 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా రూ. 59.07 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడు నెలల్లోనే అందులో వివిధ రకాల కారణాలతో సుమారు 3400 మంది వరకు తగ్గించారు. మరింత మందిని తగ్గించే ప్రయత్నంలో భాగంగా పలు దశలుగా పింఛన్ల తనిఖీలు చేపట్టనున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి జిల్లాలో వైద్యులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించనున్నరు. ఇందులో ముందుగా రూ.15వేలు పొందుతున్న పింఛన్‌దారులను తనిఖీ చేయనున్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాయ ఉద్యోగులు

### తనిఖీకి శ్రీకాకుళం నుంచి 4 వైద్య బృందాలు

నేటి నుంచి పింఛన్ తనిఖీలు మొదలు పెట్టనున్న నేపథ్యంలో ఒక్కో బృందంలో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఒక పీహెచ్‌సీ డాక్టర్, సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయితే సదరం సర్టిఫికెట్లు జిల్లా డాక్టర్లు ఇవ్వడంతో అదే డాక్టర్లు తనిఖీలు చేయడం సరికాదని నిర్ణయించారు. దీంతో శ్రీకాకుళం జిల్లా నుంచి 8 మంది స్పెషలిస్ట్ డాక్టర్లను జిల్లాకు నియమించారు. ఈ క్రమంలో డాక్టర్లు తనిఖీ చేస్తున్న సమయంలో వారికి భద్రత కోసం ఒక్కో బృందానికి సచివాలయ మహిళా పోలీసులను ఏర్పాటు చేయనున్నారు.



### మొదటి దశలో

**మంచానికే పరిమితమైన వారికి పరీక్షలు**

మంచానికే పరిమితమై పక్షవాతంతో పాటు తీవ్రమైన మస్క్యులర్ డిస్ట్రోఫీ సమస్యలు ఉండి జిల్లాలో నెలకు రూ.15 వేలు పింఛన్ పొందుతున్న 87 మందిని మొదట పరిశీలించనున్నారు. రోగుల ఇంటి వద్దకే వెళ్లి అర్హత పరీక్షలు చేపట్టనున్నారు. ఈ తనిఖీల ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు గ్రామాల్లో ఇళ్ల వద్దకే వెళ్లి పరీక్షించనున్నారు.

### రెండో దశ

**23 రకాల పింఛన్ లబ్ధిదారులకు..**

రెండోదశలో విభిన్న ప్రతిభావంతులతోపాటు కళాకారులు, వివిధ రోగాలకు చెందిన 23 రకాల పింఛన్ దారులకు అర్హత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లాలో 16,667 మందిని ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తనిఖీ చేయనున్నారు. ఆ దిశగా ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారు.

### మూడో దశలో

**వితంతువుల పింఛన్లు**

మూడో దశలో మార్చి నుంచి జిల్లాలో వితంతువు పింఛన్లు పొందుతున్న 34,364 మందిని తనిఖీ చేయనున్నారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ 1 వరకు మాత్రమే భర్త చనిపోయి వితంతువులైన వారికి మాత్రమే కూటమి ప్రభుత్వం జిల్లాలో కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. నవంబర్ 1కి ముందు భర్త చనిపోయి వితంతువు అయితే వారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇవ్వకపోవడం గమనార్హం.

### నాల్గో దశలో

**మిగిలిన వారందరిపై..**

4వ దశలో పింఛన్లు పొందుతున్న 90,511 మంది వృద్ధులను ఏప్రిల్‌లో తనిఖీ చేయనున్నారు. ఇప్పటికే ఈ ఏడు నెలల కాలంలో సుమారు 3400 మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఎందుకని అధికారులను ప్రశ్నిస్తే మృతి చెందారని, వివిధ రకాల సమాధానాలు ఇస్తున్నారు.

### పారదర్శకంగా తనిఖీలు

పింఛన్ల తనిఖీలు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకున్నాం. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. జిల్లాలో తొలిదశలో 87 మంది తీవ్రమైన మస్క్యులర్ డిస్ట్రోఫీ సమస్యలు ఉన్న వారిని తనిఖీలు చేస్తాం. తనిఖీలు చేపడుతున్న నాలుగు బృందాలకు అన్ని శాఖల అధికారులు సహకరించాలి. శ్రీకాకుళం జిల్లా నుంచి 8 మంది వైద్యులతో నాలుగు బందాలను ఏర్పాటు చేశాం.

– డాక్టర్ భాస్కరరావు,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి,
పార్వతీపురం మన్యం

### పేదల పొట్ట కొట్టేందుకు చర్యలు



కూటమి ప్రభుత్వం పేదల పొట్ట కొట్టే విధంగా చర్యలు చేపట్టింది. పింఛన్‌లు పెంచామంటూ ఊదరగొట్టి ఇప్పుడు తొలగింపు చర్యలు చేపట్టి తన మార్క్ పాలన కొనసాగిస్తోంది. అధికారం చేపట్టి 200 రోజులు గడుస్తున్నా ప్రజలకు మేలు చేయకుండా యూటర్న్ పాలిటిక్స్ చేస్తోంది. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– అలజంగి జోగారావు,
మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

### 50 ఏళ్లకే పింఛన్ అన్నారు.. ఇప్పుడు ఉన్నవి తొలగిస్తున్నారు




ఎన్నకల ముందు పింఛన్‌లు పెంచుతామని, 50 ఏళ్లకే పింఛన్‌లు ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు అర్హత పరీక్షల పేరుతో తొలగించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటు. ఇదంతా పింఛన్లు తొలగించేందుకు చేస్తున్న తనిఖీలే.

–శత్రుచర్ల పరీక్షిత్ రాజు,
వైఎస్సార్‌సీపీ, జిల్లా అధ్యక్షుడు,
పార్వతీపురం మన్యం

# వారు ఓసీలా..!

- తప్పులతడకగా టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్
- వర్గీకరణ నేపథ్యంలో ఎస్సీ ఉద్యోగుల వివరాలు కోరుతున్న ప్రభుత్వం
- రెల్లి సామాజిక వర్గానికి చెందిన వారిని ఓసీ క్రిస్టియన్‌గా చూపిస్తున్న యాప్
- ఆందోళన చెందుతున్న ఆ సామాజిక వర్గం ఉపాధ్యాయులు



టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో వెరిఫికేషన్ చేస్తే సబ్ కేస్ట్ వద్ద ఓసీ క్రిస్టియన్ అని చూపిస్తున్న చిత్రం

**వీరఘట్టం:** వర్గీకరణ కోసం ఎస్సీ ఉపకులాల్లో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారో తెలుసుకోవడానికి రూపొందించిన యాప్ తప్పుల తడకగా ఉంది. ఎస్సీ వర్గీకరణ అంశం రాష్ట్రాల పరిధిలో ఉందని ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ వేసింది. ఎస్సీల్లో మాల, మాదిగ, రెల్లి తదితర 59 ఉపకులాల వారు రాష్ట్రంలో ఉన్నారు. వారిలో ఏయే శాఖల్లో ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారో తెలుసుకునేందుకు కమిషన్ చర్యలు చేపట్టింది. ఇందులో తొలుత ఉపాధ్యాయ వర్గాల్లో ఎస్సీలు ఎంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు 'టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్' అనే యాప్ ద్వారా వారి వివరాలను సేకరిస్తున్నారు. అయితే ఈ యాప్‌లో మాల, మాదిగ, ఇతర ఉపకులాల టీచర్లు తమ వివరాలు నమోదు చేస్తుంటే ఆ వివరాలు సక్రమంగానే నమోదవుతున్నాయి. కానీ రెల్లి సామాజిక వర్గానికి చెందిన వారిని మాత్రం ఈ యాప్‌లో ఓసీ క్రిస్టియన్‌గా చూపిస్తుండడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

### సాంకేతిక సమస్య ఉంది



టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ యాప్‌లో రెల్లి ఉపకులాల ఉపాధ్యాయుల వివరాలు నమోదు చేస్తుంటే ఫైనల్‌గా వారిని ఓసీ క్రిస్టియన్ అని చూపిస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు తెలిపారు.ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. సాంకేతిక సమస్య వల్ల ఇలా జరిగి ఉండవచ్చని రెండు లేదా మూడు రోజుల్లో యాప్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

-ఎన్.తిరుపతినాయుడు, డీఈఓ,
పార్వతీపురం మన్యం జిల్లా

### మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట ఏజెన్సీలోని పలు పర్యాటక ప్రదేశాల్లో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. అడ్వెంచర్ పార్కులో వివిధ సాహస క్రీడల్లో పాల్గొన్నారు. అలాగే జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి ఆనందించారు. మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ఆడలి వ్యూపాయింట్ అందాలు ఆస్వాదించారు.

-సీతంపేట



చిన్నారుల ఆటవిడుపు



పార్కులో పర్యాటకుల బోటుషికారు

# ఆ వీధులన్నీ జాతీయ నాయకులవే..!



- ఒక్కో వీధికి ఒక్కో నాయకుడి పేరు
- వస్త్రపురికాలనీలో వివాదాలకు దూరంగా ప్రజల జీవనం



వస్త్రపురికాలనీలోని ఓ వీధి



ప్రతి వీధికి ఇలా జాతీయ నాయకుడి పేరుతో బోర్డులు

**రాజాం:**

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల జీవన విధానాలు మారుతున్నాయి. పరుగుపెడుతున్న సాంకేతికతతో పాటు ప్రజలు కూడా పరుగులు తీస్తున్నారు. ఈ ప్రయాణంలో కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నం కాగా, ఆ కుటుంబ పెద్దలు కూడా గుర్తులేని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో జాతీయ నాయకుల పేర్లు గుర్తుండడమే గగనం. ఇలాంటి స్థితిలో కూడా కొన్ని ప్రాంతాల్లో జాతీయ నాయకులు, స్వాతంత్ర్య పోరాటయోధులను గుర్తుంచుకునే వారు ఉన్నారు. ఈ కోవలోకే వస్తుంది రాజాం మున్సిపాల్టీ పరిధిలోని వస్త్రపురికాలనీ. ఈ కాలనీలోని ప్రజలు తమ వీధులకు జాతీయ నాయకుల పేర్లు పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగానే తమ జీవనాన్ని కూడా కొనసాగిస్తున్నారు.

### 20 ఏళ్లుగా కాలనీ..

రాజాం మున్సిపాల్టీగా ఏర్పడక ముందే వస్త్రపురి కాలనీ ఉంది. 2002లో ఇక్కడ అధికంగా నివాసాలు పెరిగాయి. అప్పట్లో ఇక్కడ నివాసాలు ఏర్పర్చుకున్నవారిలో దేశభక్తి, జాతీయభావాలు కలిగిన వారు అధికంగా ఉన్నారు. వారంతా కలిసి తాము నివసిస్తున్న కాలనీలోని ఒక్కో వీధికి ఒక్కో జాతీయ నాయకుడి పేరు పెట్టుకోవాలని సంకల్పించారు. అప్పట్లో తీసుకున్న ఆ నిర్ణయం మేరకు ఒక వీధికి సర్దార్ వల్లభాయ్ పటేల్ వీధి అని, మరో వీధికి వివేకానంద వీధి అని, ఇంకో వీధికి సుభాష్ చంద్రబోష్ వీధి అని, భగత్‌సింగ్, ఝాన్సీ లక్ష్మీభాయి, ఛత్రపతి శివాజీ, అల్లూరి సీతారామరాజు తదితర పేర్లతో వీధులకు బోర్డులు పెట్టారు. ఆయా జాతీయ నాయకులను స్మరించుకోవడంతో పాటు ఇప్పటికీ ఆ జాతీయ నాయకుల వర్ధంతి, జయంతులను ఇక్కడి వారు కులమతాలకు అతీతంగా నిర్వహిస్తుంటారు. మొత్తం 400 మందికి పైగా కుటుంబాలు నివసిస్తున్న ఈ కాలనీలో ఏడు వీధులు ఉన్నాయి. అన్ని వీధులకు సీసీ రోడ్లు, మురుగుకాలువలు, తాగునీటి సదుపాయం ఉంది. వాటిని పొదుపుగా వీరు వినియోగించుకుంటున్నారు.

### ఎవరి పనిలో వారు

వస్త్రపురికాలనీలో ఉన్నవారంతా రోజంతా బిజీగా ఉంటారు. ఎవరు పని వారుచేసుకోవడం, కష్టసుఖాల్లో ఒకరికి ఒకరు సాయం చేసుకోవడం చేస్తుంటారు. ఇక్కడ పెద్దగా వివాదాలు ఉండవు. కులమత తారతమ్యాలకు తావుండదు. 2002లో ఇక్కడికి మేం వచ్చి స్థిరపడ్డాం. ఇక్కడి నుంచీ ఇంకెక్కడికీ వెళ్లాలని అనిపించదు.

–ఎంవీ ప్రసాదరావు, ఎంఈఓ, వస్త్రపురికాలనీ

### అందరూ కలిసికట్టుగా

వస్త్రపురికాలనీ అనగానే ప్రశాంత వాతావరణం కనిపిస్తుంది. పట్టణానికి చివర్లో ఉన్నప్పటికీ ఉపాధినిచ్చే పరిశ్రమలకు దగ్గరగా ఈ గ్రామం ఉంది. అందరికీ నిత్యం ఏదో ఒక పని ఉంటుంది. తమ పని తాము చేసుకుంటూ, ఇతరుల కష్టసుఖాల్లో కలిసికట్టుగా జీవిస్తుంటారు. ఇదే ఇక్కడి ప్రశాంత వాతావరణానికి కలిసివచ్చే అంశం.

–చప్పటి పెంటయ్య, వస్త్రపురికాలనీ, రాజాం



కాలనీలో ప్రభుత్వ పాఠశాల వద్ద జాతీయ నాయకుడి విగ్రహం



ప్రతి వీధిలో దర్శనమిస్తున్న బోర్డులు

### క్లీన్ అండ్ గ్రీన్‌గా..

వస్త్రపురికాలనీ నిత్యం క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంటుంది. చిన్నచిన్న వీధులతో ఉన్నప్పటికీ ఇక్కడి వారంతా సమన్వయంగా వ్యవహరించడం, పరిసరాల పరిశుభ్రత పాటించడం విశేషంగా మారింది. ఏ పండగైనా, శుభకార్యక్రమమైనా గొప్పగా నిర్వహించుకుంటారు. ఎటువంటి వివాదాలు, రాజకీయ ద్వేషాలు లేని వార్డుగా రాజాం మున్సిపాల్టీలో ఈ వార్డుకు పేరొంది.

### గ్రామాల్లో మేలుకొలుపులు

గ్రామాల్లో శ్రీరామ భక్తులు వాసుదేవుడ్ని ప్రార్థిస్తూ మేలు కొలుపులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం రేగిడి మండలంలోని చిన్నశిర్లాం, తాటిపాడు, లక్ష్మణవలస, వావిలవలస తదిత ర గ్రామాల్లో సందడిగా మేలుకొలుపుల కార్యక్ర మం నిర్వహించారు. బూరాడ గ్రామానికి చెందిన పలువురు భక్తులు గ్రామాల్లో తెల్లవారు జామున నగర సంకీర్తనలు చేస్తూ మేలు కొలుపు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలతో గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తోంది.

-రేగిడి



## క్లుప్తంగా

### కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే చర్యలు

• ఎస్పీ వకుల్ జిందల్


వకుల్ జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాటలు నిర్వహించినా, బెట్టింగులకు పాల్పడినా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గతంలో ఇదే తరహాలో నేరాలకు పాల్పడి, అరెస్టయిన వ్యక్తులను స్టేషన్‌కు పిలిచి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయాలని సూచించారు.

### క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభం


క్రెడాయ్ ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం రూరల్: ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి క్రెడాయ్ ప్రాపర్టీ షో మంచి అవకాశమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులు జరగనున్న ఈ ప్రాపర్టీ షోను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రెడాయ్ సభ్యులు సుభాష్ చంద్రబోష్, తదితరులు పాల్గొన్నారు.

### కోడి పందెంరాయుళ్ల అరెస్ట్

వేపాడ: మండలంలోని ఎస్.కోట సీతారాంపురం సమీపంలో ఆదివారం సాయంత్రం వల్లంపూడి పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఏడుగురు కోడి పందెంరాయుళ్లు పట్టుబడినట్లు వల్లంపూడి ఎస్సై బి.దేవి తెలిపారు. ఈ సందర్భంగా కోడి పుంజు, రూ. ఐదు వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

### చికిత్స పొందుతూ మహిళ మృతి


శ్రీదేవి మృతదేహం

వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామానికి చెందిన గోకేడ శ్రీదేవి (38) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. ఇందుకు సంబంధించి ఎస్సై బి. దేవి తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దేవి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ తట్టుకోలేక జనవరి ఒకటో తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి వేపాడ పీహెచ్‌సీకి తరలించగా.. ప్రథమ చికిత్స అనంతరం ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి కేజీహెచ్‌కు రిఫర్ చేయగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి దేముడమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త రాము, ఇద్దరు పిల్లలున్నారు.

### లారీ ఢీకొని వృద్ధుడి మృతి


సంఘటనా స్థలంలో తిరుపతి మృతదేహం

మక్కువ: మండలంలో కన్నంపేట గ్రామం వద్ద లారీ ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. కన్నంపేట గ్రామానికి చెందిన మత్స తిరుపతి (73) అదే గ్రామంలోని బీసీ కాలనీలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి హాజరై.. తిరిగి వస్తుండగా వెనుకనుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికెన్

బ్రాయిలర్

| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹120 | ₹210 | ₹220 |

# పుంజుకుంటున్న కోళ్లు..


కాకి డేగ రకం పుంజు



• ప్రత్యేకంగా పందెంకోళ్ల పెంపకం • గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన వారు వచ్చి కొనుగోలు
• ఒక్కో పుంజు రూ. 20 వేల నుంచి 30 వేల వరకు పలుకుతున్న ధరలు


పచ్చకాకి


కాకిజాతి కోడి పుంజు


కాకి నెమలి రకం కోడిపుంజు

సీతానగరం: సంక్రాంతి పండగ వచ్చిందంటే చాలు ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కోడిపందాల సందడి నెలకొంటుంది. లక్షలాది రూపాయలతో పందాలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ పందాల్లో పోటీపడే వివిధ జాతుల కోడిపుంజులను మన ప్రాంతంలో పెంచుతున్న విషయం చాలా మందికి తెలియకపోవచ్చు. కాని ఇది నిజం. బొబ్బిలి, సీతానగరం ప్రాంతాల కోడిపుంజులకు ఎనలేని గిరాకీ ఉంది. సీతానగరం మండలంలోని బుడ్డిపేట, సీతానగరం, అప్పయ్యపేట గ్రామాల్లో చాలా మంది పందెం కోళ్లను పెంచుతూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వీరు పెంచిన పుంజులకు ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గొప్ప గిరాకీ ఉంది. కోళ్లకు బాదం, జీడిపప్పు, తవుడు, కోడిగుడ్లను ఆహారంగా పెడుతుంటారు. ఎటువంటి తెగుళ్ల సోకకుండా ఉండేందుకు అవసరమైన టీకాలు కూడా వేస్తుంటారు. అలాగే వ్యాయామం కోసం సువర్ణముఖీ నదిలో రెండు పూటలా ఈత కొట్టిస్తుంటామని పెంపకందారులు చెబుతున్నారు. పందెంకోళ్లను సామూహికంగా కాకుండా ఒక్కో కోడిని ఒక్కో బుట్టలో ఉంచుతామని తెలిపారు. పచ్చకాకి, కాకి, డేగ, కాకిడేగ, కాకినెమలి, పసిలింగర్ నెమలి జాతులు పెంచుతున్నామని, ఉభయ గోదావరి జిల్లాల వారు వచ్చి తమ దగ్గర ఒక్కో కోడిని రూ. 20 వేల నుంచి 30 వేల రూపాయల వరకు కొనుగోలు చేస్తుంటారని చెప్పారు.

#### అలవాటుగా మారింది..

మాది సన్నకారు రైతు కుటుంబం కావడంతో మొదట నుంచీ కోళ్లను పెంచుతుంటాం. అయితే పందెం కోళ్లకు గిరాకీ ఉండంతో కొన్నాళ్లుగా ప్రత్యేకంగా వాటిని పెంచుతున్నాం. చిన్న పిల్లల్లా చూసుకుంటూ పెంచితే మంచి డబ్బులు వస్తాయి. గోదావరి, కృష్ణా జిల్లాల వారు వచ్చి మా దగ్గర కోళ్లను కొనుగోలు చేస్తుంటారు. దీంతో మాకూ ఆర్థిక భరోసా లభిస్తుంది.

– కూర్మారావు, పెంపకందారు, బుడ్డిపేట

## నాటు కోళ్లకు గిరాకీ...

• పెంపకానికి ముందుకు వస్తున్న గిరిజనులు


మూలగూడలో గిరిజనుడి ఇంట పెరుగుతున్న నాటుకోళ్లు


సీతంపేటలోనాటుకోళ్లు పంచుతున్న సంస్థ ప్రతినిధులు

భామిని: సంక్రాంతి పండగ నాడు ముక్క లేనిదే ముద్ద దిగదు.. నాన్‌వెజ్ ఎన్నిరకాలున్నా నాటుకోడి మాంసం ఉంటే అదో మజా.. పండగ సమీపిస్తుండడంతో నాటుకోళ్లకు గిరాకీ నెలకొంది. రెగ్యులర్ చికెన్ షాపుల్లో బ్రాయిలర్ కోళ్లతో పాటు నాటుకోళ్లు ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. అలాగే వారపు సంతల్లో అయితే నాటుకోళ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఏజెన్సీలో ప్రతి ఇంటా నాటుకోళ్ల పెంపకం జరుగుతుండగా.. ప్రత్యేకంగా నాటుకోళ్ల ఫారాలు కూడా వెలుస్తున్నాయి. ప్రస్తుతం నాటుకోడి (లైవ్) కిలో రూ. 300 నుంచి 500 రూపాయల మధ్య పలుకుతోంది.

#### పెంపకంపై ప్రోత్సాహం..

పార్వతీపురం మన్యం జిల్లాలో నాటు కోళ్ల పెంపకంపై ఐటీడీఏ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెంపకందారులను ప్రోత్సహిస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో వాస్సన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే 30 నాటు కోళ్ల ఫారాలు ఏర్పాటయ్యాయి. మరో 200 మినీ కోళ్ల షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పశు సంవర్థక శాఖ అధికారులు కూడా నాటుకోడి ఫారాల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు.

#### ప్రోత్సహిస్తున్నాం..



నాటుకోళ్ల పెంపకంపై పెంపకందారులను ప్రోత్సహిస్తున్నాం. ఒక్కో యూనిట్‌కు రూ. 1.30 లక్షలు ఖర్చు చేస్తున్నారు. షెడ్లతో పాటు 50 కోడి పెట్టలు, 10 కోడి పుంజులు ఇస్తున్నాం. నాటుకోడి మాంసం ఆరోగ్యకరం కావడంతో పెంపకానికి ఎక్కువ మంది ముందుకు వస్తున్నారు. కోళ్లకు అవసరమైన వ్యాక్సిన్లు కూడా అందుబాటులో ఉంచుతున్నాం.

– కళ్యాణ్ పాత్రో, ప్రోగ్రాం మేనేజర్, వాస్సన్ సంస్థ, సీతంపేట

#### బలవర్థక ఆహారం



నాటు కోడి మాంసం రుచితో పాటు శరీర పెరుగుదలకు చాలా అవసరం. బలవర్థక ఆహారం కావడంతో నాటుకోడి మాంసానికి గిరాకీ నెలకొంది. ప్రస్తుతం చాలా మంది కోళ్లను పెంచుతున్నారు. అటు ఆహారానికి ఆటు ఆర్థిక అవసరాలకు కూడా ఉపయోగపడతాయి.

డాక్టర్ కె..దీపికారాణి, వైద్యాధికారి, బాలేరు పీహెచ్‌సీ

## వాలీబాల్ పోటీలకు జేఎన్‌టీయూ జీవీ జట్టు


జట్టు సభ్యులతో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి

విజయనగరం అర్బన్: జైపూర్ యూనివర్సిటీలో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ పోటీలలో పాల్గొనే జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ జట్టును యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ఆదివారం ప్రకటించారు. ఇటీవల జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన ఇంటర్ కళాశాలల పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈ మేరకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన జట్టులో పి.శ్రావణి (జీఎంఆర్‌ఐటీ, రాజాం), జి.గుణ (శ్రీవిజ్ఞాన్ ఉమెన్స్ కాలేజ్), పి.గాయత్రి (అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ భోగాపురం), పి.శృతి (ఇమ్మాన్యుయేల్ ఇంజినీరింగ్ కాలేజ్), జి.హర్షిత (జీఎంఆర్‌ఐటీ), బి.మోహన్‌లతా, ఎం.సువర్ణ (జేఎన్‌టీయూ జీవీ, విజయనగరం), కె.కీర్తి (అవంతి ఇంజినీరింగ్ కాలేజీ, గరివిడి), ఎ.తస్నీరాణి (డైట్ కాలేజీ), వి.ధాత్రి (జీఎంఆర్‌ఐటీ), బి.కావ్య (విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, ఉమెన్స్), బి.సాయిసుచిత్ర (జీఎంఆర్ ఐటీ) ఉన్నారు. ఎంపిక ప్రక్రియలో యూనివర్సిటీ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏవీ పాపారావు, డాక్టర్ జి.అప్పలనాయుడు పాల్గొన్నారు. ఎంపికైన జట్టు సభ్యులకు యూనివర్సిటీ వీసీ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు, యూనిఫారాలు, నగదు ఇచ్చి అభినందించారు.

# కోర్టుకు వెళ్లి తేల్చుకో..

• రెవెన్యూ సదస్సులో ఓ వీఆర్‌ఓ సమాధానం
• లబోదిబోమంటున్న బాధితుడు


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు

బలిజిపేట: భూ సమస్యపై అర్జీ ఇచ్చిన ఓ రైతుకు వీఆర్‌ఓ తలతిక్క సమాధానం చెప్పడంతో బాధితుడు అవాక్కయ్యాడు. కోర్టుకు వెళ్లి భూ సమస్యను పరిష్కరించుకోవాలని ఉచిత సలహా ఇవ్వడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. బాధితుడు తెలియజేసిన వివరాల్లోకి వెళితే.. ఈ నెల నాలుగో తేదీన వంతరాం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాగుల లక్ష్మణ తనకు వంశపారంపర్యంగా సంక్రమించిన భూమిని తన పేరిట ఆన్‌లైన్ చేయాలని కోరగా.. వీఆర్‌ఓ ఎ.గోపాలకృష్ణ దురుసుగా సమాధానం చెప్పాడు. నీ సమస్య ఇక్కడ పరిష్కారం కాదని..కోర్టుకు వెళ్లిపోవాలని బదులివ్వడంతో ఏమి చేయాలో తెలియక బాధితుడు మిన్నకుండిపోయాడు. లక్ష్మణకు వంతరాంలో సర్వే నంబర్ 71- 6లో 16 సెంట్ల భూమి ఉంది. ఈ భూమి ఇటీవల జరిగిన రీ సర్వేలో వేరే వారి పేరుమీద నమోదైంది. తన భూమి తన పేరుపై నమోదు చేయాలని కోరితే.. కోర్టుకు వెళ్లమని చెప్పడం ఎంతవరకు సమంజసమని బాధిత రైతు వాపోతున్నాడు.

## చివరికి మందు బాబులనూ ముంచేశారు..

• అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య


విలేకరులతో మాట్లాడుతున్న సోరు సాంబయ్య

బొబ్బిలి: తల్లికి వందనం.. ఫీజు రీయింబర్స్‌మెంట్.. లక్షల ఉద్యోగాలు.. మెగా డీఎస్సీ అని నిరుద్యోగులను.. అన్నదాత సుఖీభవ అంటూ రైతులను మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చివరకు మందుబాబులనూ ముంచేశాడని అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, సాహితీపీఠం కన్వీనర్ సోరు సాంబయ్య ఆరోపించారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో విక్రయించిన బ్రాండ్ల మంచివి కావనీ, తాము అధికారంలోకి వస్తే నాణ్యమైన మద్యాన్ని వంద రూపాయలకే ఇస్తానన్న చంద్రబాబు ఇప్పుడు మాట తప్పి బార్‌లలో విక్రయించుకునేందుకు గేట్లు బార్లా తెరిచారన్నారు. బ్రాండెడ్ మద్యం కూడా షాపుల్లో దొరకడం లేదని ఆరోపించారు. మద్యం దుకాణాల నుంచి బెల్ట్‌షాపులకు మద్యం తరలిపోతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అక్కడక్కడా సివిల్ పోలీసులు మద్యం పట్టుకుంటున్నారే తప్ప.. ఎక్సైజ్ అధికారులు ఎక్కడా దాడులు చేసిన దాఖలాలు లేవని చెప్పారు. మద్యం దుకాణాల్లో అవినీతి చేపట్టినా, అధిక ధరలకు విక్రయించినా మొదటిసారి భారీ జరిమానా, రెండోసారి షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడెక్కడున్నారని ప్రశ్నించారు. మరోవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది క్వింటాకు ఐదు కిలోలు అదనంగా తీసుకుంటున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

## ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోండి

• ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్, నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మున్సిపల్ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సంక్రాంతి పండగ సందర్భంగా తమ సొంత ప్రాంతాలకు వెళ్లే సమయాల్లో తమ ఇళ్లలో ఎటువంటి దొంగతనాలు జరగకుండా ఉండేందుకు లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ ( ఎల్‌హెచ్‌ఎంఎస్) సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందల్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. దొంగతనాల నియంత్రణకు రాష్ట్ర పోలీస్‌శాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ప్రత్యేకంగా రూపొందించిందని పేర్కొన్నారు. ఈ విధానం పట్ల ప్రజలకు అవగాహన లేకపోవడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ మొబైల్ యాప్ సేవలు విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ , నెల్లిమర్ల, బొబ్బిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్పొరేషన్, మున్సిపల్ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారికి అందుబాటులో ఉందన్నారు. ఈ యాప్ ప్రజల ఆస్తుల రక్షణకు కవచంలా పనిచేస్తుందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు సమీప పోలీస్‌స్టేషన్‌లో తెలియజేస్తే పోలీసులు యాప్ సౌకర్యాన్ని ఉచితంగా అందిస్తారని చెప్పారు. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఇంటి నుంచే తమ పేరు, ఫోన్ నంబర్, లొకేషన్ వంటి ఇతర వివరాలతో పాటు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ఎప్పటి నుంచి ఎప్పటివరకూ పొందాలనుకుంటున్నారో యాప్‌లో నమోదు చేసి రిక్వెస్ట్ పంపించాలని తెలిపారు. అలా రిక్వెస్ట్ పంపించిన వారి మొబైల్‌కు ఒక రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుందని, ఆ నంబర్‌నే యూజర్ ఐడీగా పొందవచ్చన్నారు. రిక్వెస్ట్ పంపించిన తర్వాత సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసులు సదరు ఇంటిని సందర్శించి, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆయా ఇళ్లపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేస్తారన్నారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఉత్తరకుమార్ మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధి రాజయ్యపేట జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాం మున్సిపాల్టీ పరిధి కొండపేటకు చెందిన గుడివాడ ఉత్తరకుమార్ (56) తెర్లాం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం వస్తున్నాడు. రాజయ్యపేట జంక్షన్ వద్ద కలపలోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీస్తున్నారు. మృతునికి భార్య కుసుమకుమారితో పాటు ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టిన లారీ..**

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై చినభోగిలి – సీతానగరం గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు.. గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన గడిదేసు రాంబాబు విశాఖపట్నం నుంచి స్వగ్రామానికి స్కూటీపై వస్తున్నాడు. సరిగ్గా చినభోగిలి గ్రామం దాటుతుండగా.. పార్వతీపురం నుంచి ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎస్సై ఎం. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**యువకుడికి తీవ్ర గాయాలు..**

పాచిపెంట : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని పి. కోనవలస జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన బొత్స దిలీప్ కుమార్ (24) పాచిపెంట నుంచి ద్విచక్ర వాహనంపై సాలూరు వెళ్తుండగా.. పణుకువలస చైతన్య పాలిటెక్నికల్ కాలేజ్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కనున్న ఐరన్ పోల్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దిలీప్‌ను స్థానికులు 108 వాహనంలో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు.

## ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే సహించేది లేదు..


ఐక్యత చాటుతున్న మాల సంఘాల జేఏసీ నాయకులు


సభకు హాజరైన మాల కులస్తులు

• మాజీ ఎంపీ హర్షకుమార్

విజయనగరం ఫోర్ట్: ఎస్సీ వర్గీకరణ జోలికి వస్తే పీఎం మోదీ, సీఎం చంద్రబాబులకు పతనం తప్పదని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక గురజాడ కళాభారతిలో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనకు అన్యాయం చేసిన ప్రధాని మోదీ రాష్ట్రానికి వస్తే అడ్డుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణకు మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లే కారణమని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలు చేయలేక పోయారని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం పథకాన్ని వాయిదా వేయడం సరి కాదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ మాట్లాడుతూ.. 2024 ఆగస్టులో సుప్రీంకోర్టు వెలువరించిన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ గైడ్‌లైన్స్‌ను పునఃసమీక్షించాలన్నారు. కులగణన చేయకుండా ఉప కులాలుగా వర్గీకరించడం అశాస్త్రీయమని తెలిపారు. కార్యక్రమంలో మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు బీవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మిరియాల కృష్ణారావు, జేఏసీ నాయకులు బుంగ భానుమూర్తి, ప్రకాశరావు, సురగాల సూరప్పడు, ఎం. అప్పారావు, ఆదాడ మోహనరావు, పి. వెంకటరమణ, గంటాన అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.